రేపు రాష్ట్ర మంత్రివర్గ సమావేశం

హైదరాబాద్, మార్చి 4 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర క్యాబినెట్ సమావేశం గురువారం జరగనున్నది. సీఎస్ శాంతికుమారి మంగళవారం ప్రకటన విడుదల చేశారు. సచివాలయంలో సీఎం రేవంత్ అధ్యక్షతన జరుగనున్న మంత్రివర్గ భేటీలో ఎనిమిది అంశాలపై చర్చించనున్నట్టు తెలిసింది.

మరో 2 వేల కోట్ల అప్పు

మొదటిపేజీ తరువాయి...

జనవరిలో రెండు దఫాలుగా 5,800 కోట్లు, ఫిబ్రవరి 4న 3,000 కోట్లు, మార్చి 4న మరో 2,000 కోట్ల రుణాలను సమీకరించింది. 2023 డిసెంబర్ నుంచి ఇప్పటివరకు ఒక్క ఆర్బీఐ నుంచే రూ.66,827 కోట్ల అప్పు తీసుకున్న రేవంత్ సర్కారు.. ఎఫ్ఆర్‌బీఎం పరిధిలోకి రాకుండా కార్పొరేషన్లు/ఎస్పీవీల నుంచి మరో రూ.61,991 కోట్లు, ఎలాంటి గ్యారంటీ ఇవ్వకుండా 10,099 కోట్లు, టీజీఐఐసీ ద్వారా ప్రభుత్వ భూములను తనఖా పెట్టి ఐసీఐసీఐ బ్యాంక్ నుంచి మరో 10 వేల కోట్లు పొందింది. దీంతో రేవంత్ సర్కారు తెచ్చిన మొత్తం అప్పులు రూ.1,48,917 కోట్లకు చేరాయి. అయినప్పటికీ రాష్ట్రంలో కొత్తగా ఒక్క ప్రాజెక్టును చేపట్టకపోవడం, నూతన పథకాలేమీ అమలు చేయకపోవడంపై నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సీఎం అనాలోచిత నిర్ణయాలతో రాష్ట్రం అధోగతి

బీజేపీ రాజ్యసభ సభ్యుడు కే లక్ష్మణ్ మండిపాటు

హైదరాబాద్, మార్చి 4 (నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్‌రెడ్డి అనాలోచిత నిర్ణయాలతో రాష్ట్రం అధోగతి పాలైందని బీజేపీ రాజ్యసభ సభ్యుడు కే లక్ష్మణ్ మండిపడ్డారు. మంగళవారం నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. మంత్రులు ఎక్కడికెళ్లినా ప్రజలు ఆరు గ్యారంటీలపై నిలదీస్తున్నారని విమర్శించారు. కులగణన చేసి సీఎం రేవంత్ ఏ ఒక్కరినీ సంతృప్తి పరచలేదని అన్నారు. ట్రిపుల్‌ఆర్ ప్రాజెక్టును రియల్‌ఎస్టేట్ కోసం చేపడుతున్నారా? అని ప్రశ్నించారు. ప్రాజెక్టు డీపీఆర్ లోపభూయిష్టంగా తయారు చేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రాజెక్టుకు సంబంధించి ఇప్పటికీ ఎందుకు భూసేకరణ చేయలేదని నిలదీశారు.

వటపత్రశాయికి వరహాల లాలి..

యాదగిరిగుట్టలో అలంకార సేవ

యాదగిరిగుట్ట, మార్చి 4: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి తిరుకల్యాణ బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. అలంకార సేవోత్సవంలో భాగంగా మంగళవారం నృసింహస్వామి ఉదయం వటపత్రశాయి అలంకారంలో దర్శనమిచ్చారు. రాత్రి హంస వాహనంలో ప్రధానాలయ మాఢవీధుల్లో ఊరేగారు. తూర్పు మాఢవీధుల్లో ప్రత్యేక వేంచేపు మండపంలో స్వామివారిని ఆస్థానం చేసి ప్రధానార్చకులు వటపత్రశాయి విశిష్టతను భక్తులకు వినిపించారు. ఆలయ అనువంశికధర్మకర్త నరసింహమూర్తి, ఈవో భాస్కర్‌రావు, డీఈవో దోర్బల భాస్కర్‌శర్మ, ప్రధానార్చకులు నల్లన్‌థీఘళ్ లక్ష్మీనరసింహాచార్యులు, కాండూరి వేంకటాచార్యులు పాల్గొన్నారు.

వటపత్రశాయి అలంకారంలో తిరుమాఢ వీధుల్లో ఊరేగుతున్న స్వామివారు

భూములపైనా ప్లేటు ఫిరాయింపు

అప్పుడు అమ్మొద్దని సుద్దులు.. ఇప్పుడు టెండర్లు

- 30 వేల కోట్ల భూముల విక్రయానికి పన్నాగం
- రేవంత్ వైఖరి చూస్తే ఊసరవెల్లే ఉరేసుకుంటది
- నిప్పులు చెరిగిన మాజీ మంత్రి హరీశ్‌రావు
- అసెంబ్లీని తప్పుదోవపట్టించారని మండిపాటు
- రాష్ట్ర ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్

ప్రభుత్వ భూములంటే పెద్దలిచ్చిన ఆస్తి.. తెలంగాణ జాతి సంపద.. వాటిని అమ్మితే భవిష్యత్తులో శ్మశానాలకు కూడా భూమి లేకుండా పోతదని పీసీసీ అధ్యక్షుడి హోదాలో రేవంత్‌రెడ్డి మొసలి కన్నీరు కార్చిండు. అధికారంలోకి వస్తే ఇంచుకూడా ప్రభుత్వ భూమిని అమ్మబోమని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చి ఇప్పుడు వేల కోట్ల విలువైన భూములను అగ్గువకు పెట్టేందుకు తెరలేపిండు. –హరీశ్‌రావు

హైదరాబాద్, మార్చి 4 (నమస్తే తెలంగాణ): ప్రతి అంశంలోనూ నాలుక మడతేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, భూముల అమ్మకంపైనా ప్లేటు ఫిరాయించి నిస్సిగ్గుగా నిధుల సమీకరణ కోసం వేలంబాట పట్టాడని మాజీ మంత్రి హరీశ్‌రావు ఫైర్ అయ్యారు. భూముల వేలంపై రేవంత్ వైఖరిని చూసి ఊసరవెల్లి కూడా ఉరేసుకొనే దుస్థితి దాపురించిందని మంగళవారం ఎక్స్ వేదికగా విమర్శించారు. అధికారంలోకి వస్తే ఇంచు ప్రభుత్వ భూమిని కూడా అమ్మబోము అని చెప్పి ఇప్పుడు వేల కోట్ల విలువైన భూముల అమ్మకానికి కుట్ర చేస్తున్నాడని మండిపడ్డారు. మాస్టర్ ప్లాన్ పేరిట వేలం పాట నిర్వహించేందుకు కన్సల్టెంట్ నియామకానికి గత నెల 28న టెండర్లు పిలవడం రేవంత్ సర్కార్ దిగజారుడు తనానికి పరాకాష్ట అని అభివర్ణించారు. కంచ గచ్చిబౌలి గ్రామం సర్వే నంబర్ 25 పరిధిలోని 400 ఎకరాలను బ్యాంకర్లకు తనఖా పెట్టి రూ.25 కోట్లకు ఎకరం చొప్పున రూ.10 వేల కోట్లను ఇప్పటికే సమీకరించారని, ఇప్పుడు అదే భూమిని వేలం వేసి రూ.30 వేల కోట్ల సమీకరణను కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నదని తెలిపారు. బ్యాంకులో తన ఖా పెట్టడం, ఆ భూములనే వేలం వేసి అమ్ముకోవడం ప్రభుత్వ దివాలాకోరు తనానికి నిలువెత్తు నిదర్శనమని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ కపటబుద్ధిని గత డిసెంబర్‌లో జరిగిన అసెంబ్లీ సమావేశాల్లోనే ఆధారాలతో సహా బయటపెట్టామని గుర్తుచేశారు. 2024, జూన్ 26న విడుదల చేసిన జీవో ఎంఎస్ 54తో ఎకరానికి రూ.75 కోట్ల చొప్పున మొత్తం రూ.30 వేల కోట్ల విలువైన భూములు అమ్ముతున్నారని తాను అసెంబ్లీ వేదికగా నిలదీస్తే.. అలాంటిదేమీ లేదని, టీజీఐఐసీకి చేస్తున్న భూబదలాయింపు మాత్రమేనని బుకాయించారని నిప్పులుచెరిగారు. నిండు సభలో ముఖ్యమంత్రి సహా మంత్రులు తప్పుడు సమాధానం చెప్పి, సభను, సభ్యులను తప్పుదోవ పట్టించారని ఆగ్రహం వ్యక్తంచేశారు. అసెంబ్లీ సమావేశాలు అయిపోగానే అదే భూమిని తనఖా పెట్టి 10 వేల కోట్ల రుణం తెచ్చుకొని, ఇప్పుడు మళ్లీ అసెంబ్లీ మొదలయ్యేలోపే అదే భూమి అమ్మకానికి టెండర్లు పిలుస్తున్నారని మండిపడ్డారు.

ప్రగతిని ప్రచారం చేయకతప్పదు

ఆ భూములను అమ్ముకోవాలన్నా కేసీఆర్ పదేండ్లలో సాధించిన అభివృద్ధిని ప్రచారం చేసుకోక రేవంత్ సర్కార్‌కు తప్పడం లేదని హరీశ్ పేర్కొన్నారు. తెలంగాణ దివాలా తీసిందంటూనే రేవంత్ సర్కార్ రూపొందించిన ఆర్ఎఫ్‌పీలో ఆర్థిక, సామాజిక రంగాల అభివృద్ధిలో తెలంగాణ రోల్ మోడల్ అయ్యిందని, ఇండస్ట్రియల్ పాలసీ దేశానికే తలమానికమని పేర్కొన్న విషయాన్ని ఉదహరించారు. 2011-12లో రూ.3.6 లక్షల కోట్లుగా ఉన్న జీఎస్డీపీ, 2020-21 నాటికి రూ.11.5 కోట్లకు చేరిందని, దేశంలోనే అత్యధిక ఎకనమిక్ గ్రోత్ నమోదును పేర్కొన్న విషయాన్ని గుర్తుచేశారు. భూములు అమ్ముకొనేందుకు డాక్యుమెంట్ల రూపంలో చెప్తున్న తెలంగాణ అభివృద్ధి గణాంకాలను, బహిరంగంగా ఎందుకు ఒప్పుకోవడం లేదని రేవంత్‌ను ప్రశ్నించారు. కేసీఆర్ చేసిన అభివృద్ధి రేవంత్ దాచాలని ఎంత ప్రయత్నం చేసినా దాగని సత్యమని స్పష్టంచేశారు.

ఇందిరమ్మ రాజ్యంలో గజం భూమి కూడా అమ్మలేదని అసెంబ్లీ వేదికగా రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రకటించి మూడు నెలలు కూడా కాకముందే వేల కోట్ల ఆస్తులను కొల్లగొట్టే కుట్ర పన్నుతున్నరు. నిధుల సమీకరణ పేరుతో నిస్సిగ్గుగా భూములను అడ్డికి పావుసేరుకు అమ్ముతుండటం కాంగ్రెస్ ప్రభుత్వ ద్వంద్వ నీతికి నిదర్శనం. –హరీశ్‌రావు

శ్మశానాలకూ భూమి ఉండదు

భూమి. తెలంగాణకు పెద్దలు ఇచ్చిన ఆస్తి. మనం బతికేందుకు.. మన సోకులకు ఈ భూములు అమ్మొద్దు. ఒకవేళ ఈ భూములను అమ్మితే భవిష్యత్తులో ప్రజల అవసరం కోసం ప్రభుత్వ ఆస్పత్రులు గాని, విద్యాలయాలు గాని చివరికి సచ్చిపోతే శ్మశానాలకు కూడా భూమిలేని పరిస్థితి ఉంటది. తెలంగాణ జాతి సంపదను, ఐదేండ్ల కోసం ఎన్నికైన కేసీఆర్ రాష్ట్రంలో ఉన్న అన్ని భూములను తెగనమ్ముకొని పోతే భవిష్యత్తు తరాలకు ప్రభుత్వ భూములు అందుబాటులో లేకపోతే ఎట్లా? చివరికి శ్మశానాలకు కూడా కరువు వచ్చే పరిస్థితి ఏర్పడుతుంది

–పీసీసీ అధ్యక్షుడి హోదాలో సీఎం

30 వేల కోట్ల భూమిని అమ్మిండ్రు

రూ.75 కోట్లకు ఎకరం చొప్పున రూ.30 వేల కోట్ల విలువ జేసే భూమిని జీవో 54 ద్వారా 2024, జూన్ 26న ప్రభుత్వం అమ్మింది. ఈ భూమిని కుదవ పెట్టి టీజీఐఐసీ వాళ్ల బ్యాంకుల్లో రూ.20 వేల కోట్ల అప్పు తెచ్చేందుకు మూడు నెలల నుంచి కాలికిబలపం కట్టుకొని తిరుగుతున్నరు.

– డిసెంబర్‌లో జరిగిన అసెంబ్లీ సమావేశంలో హరీశ్‌రావు

గజం భూమి అమ్మలేదు

రెవెన్యూ సెక్టారు నుంచి టీజీఐఐసీకి ట్రాన్స్‌ఫర్ అయింది. అంతే తప్పితే ఈ ఇందిరమ్మ రాజ్యంలో ఒక్క గజం అమ్మినట్టు మీరు రుజువు చేయండి

– అసెంబ్లీలో హరీశ్ ప్రశ్నకు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి సమాధానం

ఆ ప్రశ్నలకు బదులేది?

- ఇంతకాలమైనా సమాధానాలివ్వరా?
- శాసనసభ స్పీకర్‌కు మాజీ మంత్రి హరీశ్ లేఖ

హైదరాబాద్, మార్చి 4 (నమస్తే తెలంగాణ): గత అసెంబ్లీ సమావేశాల సందర్భంగా తాము లేవనెత్తిన అంశాలపై తమకు ఇప్పటికీ సమాధానాలు రాలేదని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ పేర్కొన్నారు. ప్రభుత్వం నుంచి తక్షణమే సమాధానాలు ఇప్పించాలని మంగళవారం ఆయన శాసనసభ స్పీకర్‌కు రాసిన లేఖలో పేర్కొన్నారు. నక్షత్రం గుర్తులేని ప్రశ్నలకు (అన్‌స్టార్డ్) సమాధానాలు రాకపోవడం పట్ల ఆవేదన వ్యక్తంచేశారు. అసెంబ్లీ నిబంధనావళి (52 (1)) ప్రకారం సభ్యులు అడిగిన నక్షత్రం గుర్తులేని ప్రశ్నలకు రాతపూర్వక సమాధానాలను సభా టేబుల్‌పై అందుబాటులో ఉంచాల్సి ఉంటుందని, గడిచిన అసెంబ్లీలో తాను అడిగిన ప్రశ్నలకు ఇప్పటివరకు సమాధానాలు రాలేదని తెలిపారు. ప్రజల కోసం అసెంబ్లీలో ప్రశ్నలు అడగటం, సకాలంలో వాటికి సమాధానాలు పొందటం శాసనసభ సభ్యుల హక్కు అని పేర్కొన్నారు. తాను అడిగిన ప్రశ్నలకు వెంటనే సమాధానాలు ఇచ్చేలా సంబంధిత అధికారులను ఆదేశించాలని స్పీకర్‌ను కోరారు.

1,891 కోట్ల బకాయిలు చెల్లించండి

- సీఎమ్మార్ గడువు పొడిగించండి
- కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషీకి సీఎం, మంత్రి ఉత్తమ్ విజ్ఞప్తి
- ముగిసిన ఢిల్లీ పర్యటన

హైదరాబాద్, మార్చి 4(నమస్తే తెలంగాణ): కేంద్ర ప్రభుత్వం నుంచి సివిల్ సప్లై శాఖకు రావాల్సిన రూ.1,891 కోట్ల బకాయిలను విడుదల చేయాలని కేంద్ర ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషీకి సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం ఢిల్లీలో కేంద్రమంత్రితో వారు భేటీ అయ్యారు. 2014-15లో సరఫరా చేసిన బియ్యం బకాయిలు రూ.1,468.94 కోట్లు, 2021-2022 వరకు ఉచిత బియ్యం సరఫరాకు సంబంధించి రూ.343.27 కోట్లు, మరో రూ.79.09 కోట్ల ఇతర బకాయిలను విడుదల చేయాలని కోరారు. సీఎమ్మార్ గడువును నాలుగు నెలల పాటు పొడిగించాలని విన్నవించారు. రాష్ట్రానికి పీఎం కుసుమ్ కింద గతంలో ఇచ్చిన 4 వేల మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి అనుమతులను పునరుద్ధరించాలని కోరారు. గతంలో 4 వేలకు అనుమతిచ్చి ఇప్పుడు వెయ్యి మెగావాట్లకు కేంద్రం కుదించిందని వివరించారు. రెండు రోజుల పాటు సాగిన సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్ ఢిల్లీ పర్యటన ముగిసింది. మంగళవారం రాత్రి వారు హైదరాబాద్‌కు చేరుకున్నారు.

ప్రభుత్వ దవాఖానల్లో పాలియేటివ్ కేర్

మంత్రి శ్రీధర్‌బాబు వెల్లడి

హైదరాబాద్, మార్చి 4 (నమస్తే తెలంగాణ): పాలియేటివ్ కేర్ (ఉపశమన సేవలు)పై సమాజంలో మరింత అవగాహన రావాల్సిన అవసరం ఉందని, ఆ దిశగా ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇటువంటి సేవలు అందుబాటులోకి రావాల్సి ఉందని, ఈ విషయంలో స్వచ్ఛంద సంస్థలతో కలిసి పని చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని అన్నారు. హైదరాబాద్ ఖాజాగూడలో ఏర్పాటుచేసిన స్పర్శ్ హాస్పైస్ కేంద్రానికి మంగళవారం మంత్రి ఎలక్ట్రిక్ వాహనాలను అందించారు. చివరి దశలో ఉన్న రోగులకు ఇంటి దగ్గర వైద్య సేవలు అందించేందుకు ఉద్దేశించిన కేంద్రం స్పర్శ్ హాస్పైస్ కాగా, రోటరీ క్లబ్ ఆఫ్ బంజారాహిల్స్ ఆధ్వర్యంలో దాతలు ఈ వాహనాలను సమకూర్చారు. ఈ కేంద్రానికి ఉచితంగా నీటిని సరఫరా చేసేందుకు అవసరమైన ఆదేశాలను మంత్రి జారీచేశారు. కార్యక్రమంలో నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవ్‌రెడ్డి, శాంతా బయోటెక్ అధినేత వరప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు.

ఇద్దరు కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థుల ఖరారు!

- వేం నరేందర్‌రెడ్డి, అద్దంకి దయాకర్ ఎంపిక
- ప్రాణ స్నేహితుని కోసం సీఎం రేవంత్ లాబీయింగ్

హైదరాబాద్, మార్చి 4 (నమస్తే తెలంగాణ): తనకు అత్యంత సన్నిహితుడు, ఓటుకు నోటు కేసులో నిందితుడు వేం నరేందర్‌రెడ్డిని ఎమ్మెల్సీ చేయడానికి సీఎం రేవంత్‌రెడ్డి చేసిన లాబీయింగ్ ఎట్టకేలకు ఫలించినట్టు విశ్వసనీయంగా తెలిసింది. ఎమ్మెల్యేల కోటా ఎమ్మెల్సీ అభ్యర్థిగా తొలి జాబితాలోనే ఆయన పేరును ఖరారు చేసినట్టు సమాచారం. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తదితరులు ఎమ్మెల్సీ అభ్యర్థుల ఖరారుపై తుది కసరత్తు చేసినట్టు తెలిసింది. ఈ మేరకు సీఎం రాజకీయ సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డి, టీపీసీసీ జనరల్ సెక్రటరీ అద్దంకి దయాకర్ పేర్లతో తొలి జాబితాను టీపీసీసీ రూపొందించినట్టు సమాచారం. ఈ జాబితాను ఒకటి రెండు రోజుల్లో కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ వద్దకు పంపనున్నారని గాంధీభవన్ వర్గాలు తెలిపాయి. ఆమెతో చర్చించిన తనంతరం లిస్టును యథాతథంగా అధిష్ఠానానికి పంపే అవకాశం ఉందని పార్టీ శ్రేణులు అనుకుంటున్నాయి.

పక్కా లాబీయింగ్ చేసి..

వేం నరేందర్‌రెడ్డిని ఎంపిక చేయడానికి సీఎం రేవంత్‌రెడ్డి వ్యూహాత్మకంగా అడుగులు వేసినట్టు తెలిసింది. ఈ ప్రతిపాదనను కీలక మంత్రి ఒకరు వ్యతిరేకించే అవకాశం ఉందని తెలిసిన సీఎం, అభ్యర్థుల ఎంపికలో కీలకంగా వ్యవహరించే బాధ్యులతో ముందుగానే లాబీయింగ్ చేసినట్టు కాంగ్రెస్ శ్రేణుల్లో చర్చ జరగుతున్నది. ముందుగా భట్టి విక్రమార్కను ఒప్పించి, ఆ తరువాత టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌తో కలిసి వేం నరేందర్ రెడ్డి పేరును ప్రతిపాదించినట్టు సమాచారం. నలుగురు సభ్యులున్న ఎంపిక కమిటీలో ముగ్గురు వేం నరేందర్‌రెడ్డికి అనుకూలంగా ఉండటంతో నాలుగో సభ్యునిగా ఉన్న కీలక మంత్రి మౌనంగా ఉండిపోయినట్టు కాంగ్రెస్ వర్గాల్లో చర్చ జరుగుతున్నది. 2015లో అప్పటి టీడీపీ అధ్యక్షుడు, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో కలిసి ఇదే వేం నరేందర్‌రెడ్డిని అడ్డదారిలో ఎమ్మెల్సీని చేసేందుకు రేవంత్‌రెడ్డి విఫల యత్నం చేసిన విషయం తెలిసిందే. ఈ ఘటన ఓటుకు నోటు కేసుగా రెండు రాష్ట్రాల్లో సంచలనమైంది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నెల రోజుల్లోనే వేం నరేందర్‌రెడ్డిని ముఖ్యమంత్రి తన సలహాదారుగా నియమించుకున్నారు.

పొత్తులు, సమీకరణాల తరువాత మరో లిస్టు...

ఎమ్మెల్యేల సంఖ్యా బలాన్నిబట్టి మూడు స్థానాలు కాంగ్రెస్‌కు, ఒక స్థానంలో బీఆర్ఎస్ పార్టీకి దక్కనున్నాయి. ఐదో స్థానం కోసం కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య హోరాహోరి పోటీ ఉండనుంది. ఈనేపథ్యంలో పొత్తులు, రాజకీయ సమీకరణాల కోసం కాంగ్రెస్ పార్టీ రెండు స్థానాలు పక్కన పెట్టి, మరో రెండు స్థానాలకు అభ్యర్థులను ఎంపిక చేసినట్టు తెలిసింది.

మహిళా సంఘాలకు ఆర్టీసీ అద్దె బస్సులు

- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

హైదరాబాద్, మార్చి 4 (నమస్తే తెలంగాణ): మహిళా సంఘాలకు ఆర్టీసీ అద్దె బస్సులను కేటాయిస్తూ మంగళవారం తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. తొలి విడత 150 మహిళా సంఘాలకు బస్సులు కేటాయిస్తున్నట్టు స్పష్టం చేసింది. త్వరలో మిగిలిన సంఘాలకు రెండో విడత 450 అద్దె బస్సులు కేటాయించనున్నట్టు తెలిపింది. బస్సుల కొనుగోలుకు సర్కార్ బ్యాంకు గ్యారెంటీ ఇవ్వనున్నది.

నిర్వహణ ఆర్టీసీదే

బస్సు కొనుగోలుకు అయ్యే నిధులను ఈఎంఐ రూపంలో ఏడేండ్లపాటు ఆర్టీసీనే చెల్లించనుంది. బస్సు డ్రైవర్, కండక్టర్, డీజిల్, నిర్వహణను ఆర్టీసీనే చూసుకుంటుంది. ప్రతి నెల మండల మహిళా సమాఖ్యకు చెల్లించే బస్సు అద్దె 77,220లో నుంచి 8,857 ఈఎంఐగా ఆర్టీసీ చెల్లించనుంది.

ఎల్ఆర్ఎస్ కింద 113 కోట్లు వసూలు

హైదరాబాద్, మార్చి 4 (నమస్తే తెలంగాణ): ఎల్ఆర్ఎస్‌కు ఇప్పటి వరకు రూ.113 కోట్లు వసూలైనట్లు అధికారులు తెలిపారు. ఎల్ఆర్ఎస్ ఫీజుల వసూలు ప్రక్రియను ఈ నెలాఖరులోగా ముగించడానికి 25% రాయితీని ప్రకటించింది. ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారులకు సమాచారం ఇవ్వడం కోసం ప్రత్యేక వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తెస్తున్నారు. దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని కలెక్టర్లకు సీఎస్ శాంతికుమారి సూచించారు.

నూతన వంగడాలపై పరిశోధనలు

హైదరాబాద్, మార్చి 4(నమస్తే తెలంగాణ): వరిసాగులో యూరియా వినియోగం తగ్గించేలా నూతన వంగడాలను అభివృద్ధి చేస్తున్నట్టు అంతర్జాతీయ వరి పరిశోధన కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ డా. అజయ్ కోహ్లీ తెలిపారు. మంగళవారం వ్యవసాయ యూనివర్సిటీలో నిర్వహించిన వరి పరిశోధన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. నత్రజని వినియోగం తగ్గించినప్పటికీ దిగుబడిలో ఎలాంటి తేడాలేకుండా.. కొత్త వంగడాల అభివృద్ధికి పరిశోధనలు జరుగుతున్నాయని పేర్కొన్నారు.

వ్యాధిగ్రస్తులకు పింఛన్.. పరేషాన్

- నిలిచిపోయిన సదరం సర్టిఫికెట్ల రెన్యూవల్స్
- బోదకాలు, పక్షవాతం, ప్రమాద వైకల్య వ్యాధిగ్రస్తులకు శాపం
- ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న బాధితులు

హైదరాబాద్ మార్చి 4 (నమస్తే తెలంగాణ): పింఛన్ వస్తే ఔషధాలు తెచ్చుకోవాలని కొందరు.. పింఛన్ వస్తే అవసరాలు తీర్చుకోవాలని మరికొందరు.. ఇలా ఎందరో అభాగ్యులు మూడు నెలలుగా ఎదురుచూస్తున్నా పింఛన్ మాత్రం రావడం లేదు. మూడు నెలలుగా సదరం సర్టిఫికెట్లు రెన్యువల్ చేయకపోవడంతో పింఛన్ అందక పరేషాన్ అవుతున్నారు. బోదకాలు, పక్షవాతం, ప్రమాదాల్లో వైకల్యానికి గురైన వందలాది మంది కార్యాలయాల చుట్టూ చెప్పులరిగేలా తిరిగినా ఫలితం లేకుండా పోతున్నది. ఆన్‌లైన్ సమస్యలను సాకుగా చూపుతూ అధికారులు తప్పించుకుంటున్నారు.

నాడు నెలనెలా పింఛన్

బీఆర్ఎస్ పాలనలో పేదలకు అండగా నిలువడానికి కేసీఆర్ 21 రకాల పింఛన్లు అందజేశారు. ఇందులో వృద్ధులు, దివ్యాంగులు, ఎయిడ్స్ వ్యాధిగ్రస్థులు, బోదకాలు, డయాలసిస్, బీడీ టేకేదార్లు తదితర పింఛన్లు ఉన్నాయి. వీరందరికీ క్రమం తప్పకుండా ప్రతినెలా పింఛన్ అందేది. దివ్యాంగులు, బోదకాలు, పక్షవాతంతో బాధపడేవారి సదరం సర్టిఫికెట్లను ఎప్పటికప్పుడు రెన్యువల్ చేసేవారు. దీంతో ప్రతినెలా పింఛన్ రాగానే ఔషధాలు తెచ్చుకోవడంతోపాటు అవసరాలను తీర్చుకునేవాళ్లు. కానీ కాంగ్రెస్ పాలనలో కష్టాలు మొదలయ్యాయి. ఎయిడ్స్, బోదకాలు, ప్రమాదాల్లో వైకల్యానికి గురైనవాళ్లు ఇలా తదితరుల వికలాంగత్వ సర్టిఫికెట్లను రెన్యువల్ చేయడం లేదు. మూడు నెలలుగా మండల ఆఫీసులు, కలెక్టరేట్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నామని, అయినా పనికావడం లేదని లబ్ధిదారులు వాపోతున్నారు.

ప్రభుత్వానికి పట్టింపేది..

వాస్తవానికి పక్షవాతం తదితర అనారోగ్య సమస్యలతో బాధపడేవారికి, ప్రమాదాల్లో వైకల్యానికి గురైన వారికి వైకల్య తీవ్రతను బట్టి మూడేండ్లు, ఐదేండ్ల కాలపరిమితితో సదరం సర్టిఫికెట్లను ప్రభుత్వం జారీ చేస్తుంది. గడువు ముగిసిన తర్వాత తిరిగి వైద్య పరీక్షలు నిర్వహించి అర్హత ఉన్నవారికి మళ్లీ సర్టిఫికెట్లు ఇస్తుంది. ఈ ప్రక్రియ జాప్యం లేకుండా వెంటవెంటనే రెన్యువల్ జరిగిపోయేది. యథావిధిగా ప్రతినెలా పింఛన్ అందేది. అయితే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత సదరం సర్టిఫికెట్ల రెన్యువల్‌లో జాప్యం జరుగుతున్నది. దీంతో బాధితులు ఆఫీసుల చుట్టూ తిరుగుతున్నారు. అధికారులకు విన్నవిస్తే సర్వర్ పని చేయడం లేదని, ఆన్‌లైన్‌లో సమస్యలున్నాయని చెబుతున్నారు.

సఖ్యత లేకే సమస్యలు

కేంద్ర ప్రభుత్వం అన్ని రాష్ట్రాల దివ్యాంగులకు యూనిక్ డిజేబిలిటీ ఐడీ కార్డును జారీ చేస్తున్నది. తెలంగాణలో మాత్రం సదరం సర్టిఫికెట్లను ప్రాతిపదికగా తీసుకుంటున్నారు. కేంద్ర ప్రమాణాలు, రాష్ట్ర విధానాలకు పొంతన కుదరడం లేదు. ఈ కారణంగా సదరం సర్టిఫికెట్ల రెన్యువల్ ప్రక్రియను నిలిపివేశారని సంబంధిత అధికారులు చెబుతున్నారు. మరోవైపు ఈ విధానాల పేరుతో తమను వేధించడం సరికాదని, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే సమస్యను పరిష్కరించి న్యాయం చేయాలని లబ్ధిదారులు డిమాండ్ చేస్తున్నారు.

బడ్జెట్‌లో బీసీలకు 20వేల కోట్లు కేటాయించాలి

సీఎం రేవంత్‌కు కృష్ణయ్య లేఖ

హైదరాబాద్, మార్చి 4 (నమస్తే తెలంగాణ): వచ్చే బడ్జెట్‌లో బీసీ సంక్షేమానికి రూ.20వేల కోట్లు కేటాయించాలని రాజ్యసభ సభ్యుడు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన సీఎం రేవంత్‌కు లేఖ రాశారు. కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం.. బీసీ విద్యార్థుల మొత్తం ఫీజు చెల్లింపు స్కీమ్‌ను పునరుద్ధరించాలని, బీసీ స్టడీ సర్కిల్‌కు రూ.200 కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. విదేశీ విద్య కింద అర్హులందరికీ స్టైఫండ్ ఇచ్చేందుకు బడ్జెట్‌ను రూ.300 కోట్లకు పెంచాలన్నారు. ఈ ఏడాది ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి అదనంగా ఒక బీసీ గురుకుల పాఠశాల ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఆర్ కృష్ణయ్య లేఖలో కోరారు.

టీచర్ల గొంతుకనై పనిచేస్తా : పింగిళి శ్రీపాల్‌రెడ్డి

హైదరాబాద్, మార్చి 4 (నమస్తే తెలంగాణ) : టీచర్ల గొంతుకనై పనిచేస్తానని, సమస్యలను పరిష్కరించేందుకు పాటుపడతానని నల్లగొండ, వరంగల్, ఖమ్మం ఉమ్మడి జిల్లాల టీచర్ ఎమ్మెల్సీ నియోజకవర్గం నుంచి విజయం సాధించిన పింగిళి శ్రీపాల్ రెడ్డి పేర్కొన్నారు. తనపై విశ్వాసంతో విజయానికి కృషిచేసిన ఉపాధ్యాయులు, ఎన్నికల్లో సహకరించిన వారికి మంగళవారం ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. ఈ విజయం అందరి విజయమని, తనకు వచ్చిన అవకాశాన్ని ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి వినియోగిస్తానని పేర్కొన్నారు. తాను అందరికి అందుబాటులో ఉంటానని భరోసా ఇచ్చారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి, విద్యారంగ నిపుణులు, టీచర్లు, మేధావుల అభిప్రాయాలను చట్టసభల్లో బలంగా వినిపించేందుకు ప్రయత్నిస్తానని పింగిళి శ్రీపాల్‌రెడ్డి హామీ ఇచ్చారు.

మేం గెలిస్తే టీచర్లకు మేలు జరిగేది

ఆ విషయాన్ని మెజార్టీ ఉపాధ్యాయులు గుర్తించలేదు : టీఎస్ యూటీఎఫ్

హైదరాబాద్, మార్చి 4 (నమస్తే తెలంగాణ) : టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తాము నిలబెట్టిన అభ్యర్థులు నర్సిరెడ్డి, అశోక్‌కుమార్ గెలిస్తే టీచర్లు, విద్యారంగానికి మేలు జరుగుతుందని మెజార్టీ ఉపాధ్యాయులు గుర్తించలేకపోయారని టీఎస్ యూటీఎఫ్ ప్రకటించింది. విలువలతో కూడిన ప్రచారం చేసినా ఆదరణ తగ్గడం విచారకరమని సంఘం అధ్యక్షుడు చావ రవి, ప్రధాన కార్యదర్శి ఏ వెంకట్ ప్రకటనలో అభిప్రాయపడ్డారు. గెలుపోటములు సహజమని, ఫలితాలతో నిరాశచెందకుండా పోరాటాలు కొనసాగిస్తామని పేర్కొన్నారు. తమకు ఓట్లు వేసిన వారికి, సహకరించిన వారికి ధన్యవాదాలు తెలిపారు.

విద్యుత్తు చార్జీల పెంపు లేనట్టే

ఈఆర్సీ అడ్వైజరీ కమిటీ సమావేశంలో వెల్లడి

హైదరాబాద్, మార్చి 4 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో విద్యుత్తు చార్జీల పెంపుపై సర్కారు వెనక్కి తగ్గింది. వచ్చే ఆర్థిక సంవత్సరంలో పాత టారిఫే ఉంటుందని స్పష్టతనిచ్చింది. ఇప్పటికే పరిపాలన సహా పలు అంశాల్లో ప్రభుత్వం దారుణంగా విఫలమైందంటూ ప్రజల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతుండగా.. విద్యుత్తు చార్జీలు పెంచితే అసలుకే మోసం వస్తుందని సర్కారు భావిస్తున్నట్టు తెలిసింది. ఈ నేపథ్యంలోనే పాత టారిఫ్‌నే కొనసాగించాలని నిర్ణయించింది. తెలంగాణ విద్యుత్తు నియంత్రణ మండలి అడ్వైజరీ కమిటీ సమావేశాన్ని మంగళవారం ఎర్రగడ్డలోని విద్యుత్తు నియంత్రణ భవన్‌లో నిర్వహించారు. ఈఆర్సీ చైర్మన్ జస్టిస్ దేవరాజు నాగార్జున అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ట్రాన్స్‌కో సీఎండీ కృష్ణభాస్కర్, జేఎండీ శ్రీనివాసరావు, టీజీఎస్పీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి హాజరయ్యారు. టీజీఎస్పీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి మాట్లాడుతూ 2025-26 సంవత్సరంలో చార్జీలు పెంచబోమని ఈ సమావేశంలో ప్రకటించారు.

కరెంట్ షాక్ మృతుల పరిహారాన్ని 15 లక్షలకు పెంచాలి: పట్లోళ్ల శశిధర్‌రెడ్డి

విద్యుత్తుషాక్ మరణాలకు పరిహారాన్ని రూ.15 లక్షలకు పెంచాలని మెదక్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నేత పట్లోళ్ల శశిధర్‌రెడ్డి ఈ సమావేశంలో డిమాండ్ చేశారు. దరఖాస్తు చేసిన నెల రోజుల్లోనే ట్రాన్స్‌ఫార్మర్లు బిగించాలని, మోటార్లకు, ఫీడర్లకు మీటర్లు పెట్టవద్దని కోరారు. మెదక్‌లో విద్యుత్తు ఉపకరణాలు సరఫరా చేసే స్టోర్స్‌ను నెలకొల్పాలని పట్లోళ్ల శశిధర్‌రెడ్డి కోరారు.



బకాయిలను ప్రతి నెలా విడుదల చేయాలి: టీఆర్వీకేఎస్

రైతులు, ఇతర రంగాలకు ఉచిత విద్యుత్తుకు సంబంధించిన బకాయిలను ప్రభుత్వం ప్రతి నెల విడుదల చేయాలని తెలంగాణ రాష్ట్ర విద్యుత్తు కార్మిక సంఘం గౌరవాధ్యక్షుడు కోడూరి ప్రకాశ్ సమావేశంలో డిమాండ్ చేశారు. నష్టాల నివారణకు రాష్ట్ర ప్రభుత్వానికి తగు సూచనలివ్వాలని కోరారు. సబ్‌స్టేషన్లు, జనరేటింగ్ స్టేషన్లల్లో సిబ్బంది లేమి సమస్యగా మారిందని, వెంటనే జూనియర్ లైన్‌మెన్ సహా ఇతర పోస్టులను రిక్రూట్ చేయాలని అన్నారు. ప్రతి నెలా ఉద్యోగులకు 5వ తేదీన జీతాలిస్తున్నారని, ఒకటో తేదీన సూచించారు.

17 మందితో ఈఆర్సీ స్టేట్ అడ్వైజరీ కమిటీ

హైదరాబాద్, మార్చి 4 (నమస్తే తెలంగాణ) : తెలంగాణ విద్యుత్తు నియంత్రణ మండలి (ఈఆర్సీ)ని పునర్వ్యవస్థీకరించారు. 17 మంది సభ్యులతో కొత్త కమిటీని ఏర్పాటు చేస్తూ గెజిట్ నోటిఫికేషన్ జారీచేశారు. శేషగిరిరావు, గౌరవ్ మహేశ్వరి, ఐ గోపినాథ్, ఆర్కే అగర్వాల్, ఎం శ్రీధర్, ముదుగంటి శ్రీధర్‌రెడ్డి, శశిభూషణ్ కాచే, ఈ శ్రీధర్, ఏ వీరభద్రరావు, డీ నర్సింహారెడ్డి, డీ శ్రీహరి, వీ రాజ్‌కిరణ్, టీ కృష్ణసాయి, జీవన్‌కుమార్, పీ శశిధర్‌రెడ్డి, జీ సాయిబాబు, కే తౌర్యను సభ్యులుగా నియమించారు.

ప్రజాస్వామ్యానికి మీడియా మూలస్తంభం

ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శశాంక్ గోయల్

హైదరాబాద్, మార్చి 4 (నమస్తే తెలంగాణ): ప్రజాస్వామ్యానికి మీడియా మూలస్తంభమని ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీ డైరెక్టర్ శశాంక్ గోయల్ పేర్కొన్నారు. మంగళవారం ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీలో గయానా, నేపాల్, శ్రీలంక, టాంజానియా, సురినామ్ దేశాల నుంచి వచ్చిన 26 మంది మీడియా నిపుణులకు 'జర్నలిజం, మీడియా సంబంధాలు' అనే అంశంపై రెండు వారాల శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు.

మున్సిపాలిటీల్లో నత్తనడకన అభివృద్ధి పనులు

పనుల జాప్యంపై టీయూఎఫ్ఐడీసీ చైర్మన్ చల్లా నరసింహారెడ్డి ఆగ్రహం

హైదరాబాద్, మార్చి 4 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని పలు మున్సిపాలిటీల్లో అభివృద్ధి పనులు నత్తనడకన సాగుతున్నాయని రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ చైర్మన్ చల్లా నరసింహారెడ్డి సంబంధిత అధికారులపై ఆగ్రహం వ్యక్తంచేశారు. మంగళవారం మాసబ్‌ట్యాంక్‌లోని ఆయన కార్యాలయంలో ఐడీసీ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..మున్సిపాలిటీల్లో జరుగుతున్న పనుల పురోగతి తెలుసుకోవడానికి క్షేత్రస్థాయి పర్యటన చేయనున్నట్టు ప్రకటించారు. పనుల్లో జాప్యం జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మున్సిపాలిటీలతోపాటు కార్పొరేషన్లను కూడా సందర్శించనున్నట్టు పేర్కొన్నారు. అలాగే రాష్ట్రంలో వరంగల్, కరీంనగర్‌లు మాత్రమే కాకుండా మిగతా మున్సిపాలిటీలను కూడా స్మార్ట్ సిటీలుగా గుర్తించాలని కేంద్ర గృహనిర్మాణ, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌కు వినతి పత్రం అందించినట్టు తెలిపారు.